క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ 1.35 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పట్టణానికి చెందిన పోలా నారాయణమ్మకు బుధవారం తన క్యాంపు క్యార్యాలయంలో అందచేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఎంతోమంది పేదవారికి లబ్ధి చేకూరే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నగదు అందజేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కౌన్సిలర్ నగేష్, చెన్నకేశవస్వామి ఆలయ ధర్మకర్త నాలి కొండయ్య యాదవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సీడీపీఓ

దొనకొండ: అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీఓ సీహెచ్ భారతి పాల్గొని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు యూనిఫాం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవన ఎరువులు వాడండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు పంటల సాగులో జీవన ఎరువులు వాడి రసాయనిక ఎరువులు తగ్గించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శైలజరాణి, శేషమ్మ సూచించారు. బుధవారం మండలంలోని ఆరవల్లిపాడు, చందవరం గ్రామాల్లో జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. 30 మంది రైతులకు ఉచితంగా గులాబీ రంగు పురుగు లింగాకర్షక బుట్టలు, జీవన ఎరువులు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ, వ్యవసాయ సహాయకులు ధనరాజ్, సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా నిలిపి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు గిద్దలూరు కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మార్కాపురంలో కూడా..

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం సాయంత్రం 4 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ భవనంలో జరుగుతుందని చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ బుధవారం తెలిపారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

మార్కాపురం టౌన్: మహిళల ఆర్థికాభివృద్ధికి డీఆర్‌డీఏ క్రాంతి పథం సిబ్బంది కృషి చేయాలని ఏపీఎం రమేష్‌బాబు కోరారు. బుధవారం వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల సమైఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సమైఖ్య సంఘాల ప్రతినిధులు వైఎస్సార్ క్రాంతి పథంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలు వివరించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలని, రుణాలు తీసుకున్న సభ్యులు సకాలంలో చెల్లించేలా వివరించాలన్నారు. మండల మహిళా సమైఖ్య ప్రతినిధులు, గ్రామ సమైఖ్య సంఘాల ప్రతినిధులను ఎన్నుకున్నారు. మండల మహిళ సమైఖ్య అధ్యక్షురాలు జయమ్మ, శ్రీనిధి మేనేజర్ సులోచన, సీసీ మనో కుమారి, సిబ్బంది నాగమణి, నాగభూషణం, మహిళా సమాఖ్య కమిటీ ప్రతినిధులు, గ్రామ సమైఖ్య సంఘాల ప్రతినిధులు, వీఓఎలు పాల్గొన్నారు.


పెద్దదోర్నాలలో దంచి కొడుతున్న వర్షం


ఉన్నత పాఠశాలలోకి భారీగా చేరిన వర్షపు నీరు

పెద్దదోర్నాలలో వర్ష బీభత్సం

- గంట పాటు దంచికొట్టిన వాన
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- రైతాంగానికి ఊపిరినిచ్చిన వర్షం

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో వర్షం తన ప్రతాపాన్ని చూపింది. బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు వర్షం బీభత్సాన్ని సృష్టించింది. గంట పాటు వదలకుండా దంచి కొట్టిన వాన తీవ్రతకు మండల కేంద్రంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొద్ది రోజులుగా వర్షాలు కురవక నిరాశలో ఉన్న రైతాంగానికి ఈ వాన కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. దీంతో మిర్చి పంటను నాటుకునేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భారీగా కురిసిన వర్ష తీవ్రతకు మండల కేంద్రంలో విద్యుత్ సరపరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో అకస్మాత్తుగా కురిసిన వర్షంతో సామాజిక ఆరోగ్య కేంద్రం తడిచి ముద్దయింది. వైద్యశాలలోని పలు విభాగాల్లో నీరు నిలిచి పోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా లేక పోవడంతో రోగులకు వైద్యం అందించేందుకు సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు.


వైద్యశాలలోకి చేరిన నీటిని తోడుతున్న సిబ్బంది

కేంద్రం విధానాలను ప్రతిఘటించేందుకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న అంజనేయులు

దొనకొండ: అధిక ధరలు, విద్యుత్ చార్జీలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ప్రజా సమస్యలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, 20-22 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోదీ చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాండవ రంగారావు, నాయకులు కె.హనుమయ్య, కె.అనిల్, కె.కిరణ్‌కుమార్, కె.ఫ్రాన్సిస్, వీరరాఘవులు, ప్రభాకర్, దాసు తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన జంకె


విజయసాయిరెడ్డికి బొకే ఇచ్చి సన్మానిస్తున్న జంకె

మార్కాపురం: వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డితో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. పార్టీ కార్యక్రమాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఈయన వెంట నాయకులు భవనం రామచంద్రారెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య ఉన్నారు.

మొదటి విలేకరి.. నారద మహర్షి


మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య

దర్శి: భారతదేశంలో మొదటి విలేకరి నారద మహర్షి అని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య అన్నారు. స్థానిక ఐటీసీ హనుమంతరావు కల్యాణ మండపంలో రక్షాబంధన్, నారద మహర్షి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విజయ ఆదిత్య మాట్లాడుతూ నారద జయంతి-జర్నలిజం-భారతీయత అనే అంశం గురించి వివరించారు. భారతదేశ గొప్పదనం, జర్నలిస్టు సేవలు, ఆర్‌ఎస్‌ఎస్ భావాలను జర్నలిస్టులతో పంచుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని 10 మంది సీనియర్ జర్నలిస్టులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. యేరువ లక్ష్మీనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టులు, జిల్లా ప్రముఖ్ బాబు, దర్శి ప్రాంత ప్రచార ప్రముఖ్ మేడగం ఈశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కామాఖ్యామృతశోధన ఆధ్వర్యంలో హోమాలు

మార్కాపురం రూరల్: లోక కల్యాణార్థం కామాఖ్యామృతశోధన ఆధ్వర్యంలో మండలంలోని తిప్పాయిపాలెంలో బుధవారం ఘనంగా సహస్ర చండీ పారాయణ, చండీహోమం నిర్వహించారు. రామ్మూర్తి గురువు, వేణుశ్యామ ఆధ్వర్యంలో 108 హోమ గుండాలతో 1200 మంది భక్తులతో హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం హోమ ఫలితాన్ని భూమికి ధారపోశారు. భక్తులకు కామాఖ్యామృత శోధన గురించి వివరించారు. అమృతానంద నాద సరస్వతీ స్వామివారి భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు.

తక్కువ ఖర్చుతో మేలైన పద్ధతులు ఎంచుకోవాలి


దానిమ్మ పంటను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ ధనుంజయరావు

దర్శి: తక్కువ ఖర్చుతో మేలైన పద్ధతులు ఎంచుకుంటే అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని ఉద్యానవన పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ సైంటిస్ట్, హెడ్ డాక్టర్ కే ధనుంజయరావు సూచించారు. మన గ్రామం -మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో భాగంగా దత్తత గ్రామమైన వెంకటాచలంపల్లె ఆర్‌బీకేలో దానిమ్మ పంటపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయరావు మాట్లాడుతూ దానిమ్మ పంటలో వచ్చే తెగుళ్ల, కీటకాలు, వాటిని వ్యాప్తిపరిచే రకాల గురించి వివరించారు. ప్రస్తుతం పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు దానిమ్మకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పొలాలను సందర్శించి రైతులకు తగు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి రవి వెంకన్నబాబు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సోమ్లానాయక్, రైతులు పాల్గొన్నారు.

రెండు బైకుల ఢీ.. ఐదుగురికి గాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

కంభం: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని మద్యం మత్తులో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలు, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి స్థానిక కందులాపురం పంచాయతీ పరిధి గురుకుల పాఠశాల సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికం బైక్ మెకానిక్ షాపులో పనిచేస్తున్న నారాయణ, రాకేష్‌లు పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా అదే సమయంలో బేల్దారు పని చేసుకునే శేఖర్, స్వామిరంగయ్య, శ్రీనులు మరొక ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వస్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. సంఘటన స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శేఖర్, స్వామిరంగయ్య, శ్రీనుకు తీవ్రగాయాలు కావడంతో వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. నారాయణ, రాకేష్ లకు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వైద్యశాలలో క్షతగాత్రుల వద్ద వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

దొనకొండ: సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదిగి జీవనోపాధి పొందాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న పాల వెల్లువ పథకాన్ని ప్రారంభించారని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో బుధవారం మహిళలకు రుణ మేళా - జగనన్న పాల వెల్లువ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి మహిళకు రుణ మేళా కార్యక్రమం కింద గేదెలు కొనుగోలు చేసేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఎవరి సహాయం లేకుండా స్వతంత్రంగా జీవించడానికి ప్రభుత్వం తక్కువ వడ్డీ రుణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. పీడీసీసీబీ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకే మహిళలు గేదెలు కొనుగోలు చేసేందుకు రుణాలు అందిస్తున్నామన్నారు. పశువైద్యాధికారి దేవారెడ్డి నాయక్, కరిష్మా, వైకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, రూట్ అధికారి బి.బాలయ్య, మాజీ సర్పంచ్ పాతకోట సునీత, ఐలూరి శ్రీనివాసరెడ్డి, కాశిరెడ్డి, బాలకోటిరెడ్డి, వీఓఏలు, మహిళలు, ఆర్‌బీకే, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న డీడీ వెంకట సుబ్బయ్య

పొదిలి రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మార్కాపురం పశు సంవర్థక శాఖ డీడీ వెంకట సుబ్బయ్య అన్నారు. బుధవారం పొదిలి మండలంలోని మల్లవరం రైతు భరోసా కేంద్రంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ లోన్ మేళా-జగనన్న పాల వెల్లువపై పాడి రైతులకు అవగహన కల్పించారు. డీడీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అధ్వర్యంలో అమలు జరుగుతున్న జగనన్న పాల వెలువ కార్యక్రమంలో అమూల్ పాల కేంద్రాల్లో పాలు పోస్తే అన్ని విధాల మంచిదన్నారు. అన్ని కేంద్రాలకన్నా రేట్లు ఎక్కువతో పాటు సకాలంలో నగదు చెల్లిస్తారన్నారు. అమూల్ పాల కేంద్రాల్లో పాలు పోస్తే బ్యాంకులు లోన్ ఇస్తాయన్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేస్తుందని చెప్పారు. ఎంపీడీఓ పి. శ్రీకృష్ణ, ఉన్నగురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రెడ్డెబోయిన సుబ్బయ్య, కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ సూర్య నారాయణ, వైఎస్సార్ కేపీ సీసీ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్లలో రాధాకృష్ణ విగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠ, అభయాంజనేయస్వామి ఆలయవ వద్ద ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 31న గణపతి పూజ, అఖండ దీపారాధన, రాత్రికి తోలు బొమ్మలాట, సెప్టెంబర్ 1 హోమాలు, యంత్రాల అభిషేకాలు, జపాలు, 2న ప్రతిష్ఠ హోమాలు, ప్రాణప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ, ధ్వజ, శిఖర కలశ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

ఈ-క్రాప్ నమోదుకు రైతులు సహకరించాలి


పంట నమోదు కార్యక్రమంలో ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): పంటలు సాగుచేసిన రైతులు ఈ క్రాప్ నమోదుకు సహకరించాలని మండల వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు కోరారు. మండలంలోని కొత్రపాటివారిపాలెంలో రైతులు సాగు చేసిన పంట నమోదు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పంటల వివరాలను సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులకు ఇచ్చి నమోదు చేయించుకోవాలన్నారు. వాస్తవంగా సాగు చేసిన పంటలను పరిశీలించి నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఖరీఫ్ సీజన్ సెప్టెంబరు నెలతో ముగుస్తున్నందున రైతులు పంట నమోదు చేయించుకోవాలన్నారు.

లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

కొమరోలు: విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు పేరుప్రతిష్టలు తీసుకు రావాలని స్థానిక ఎంపీడీవో డి.నరసయ్య తెలిపారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు బుధవారం వెల్‌కమ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఎంపీడీవో డి.నరసయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 16 నుంచి 20 ఏళ్ల యువతీ యువకులు చెడు ప్రభావాలకు లోను కాకుండా మంచి విద్యార్థులుగా కళాశాలల నుంచి బయటకు రావాలని కోరారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్చికి ఎమ్మెల్యే మద్దిశెట్టి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

కురిచేడు: మండలంలోని పడమరనాయుడుపాలెం గ్రామంలో చర్చికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ బుధవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ షేక్ సైదా, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గాలిముట్టు దేవప్రసాదు ఆధ్వర్యంలో పడమరనాయుడుపాలెం గ్రామస్తులకు ఎమ్మెల్యే వేణుగోపాల్ ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యేకు చర్చి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేమా శ్రీనివాసులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు పంపిణీ


పంట పొలంలో లింగాకర్షక బుట్టల ఏర్పాటు గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారులు

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలో పత్తి పంట సాగు చేసే రైతులకు లింగాకర్షక బుట్టలను బుధవారం పంపిణీ చేశారు. ఆత్మా ఫార్మర్ ఓరియెంటెడ్ పథకం కింద జిల్లా వనరుల కేంద్రం సహకారంతో పత్తిలో గులాబీరంగు పురుగు ఉధృతిని నివారించేందుకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి పీ మధుబాబు తెలిపారు. వాటిని పొలాల్లో అమర్చి చూపించినట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల నమోదు సమయం ముగియనుందని ఆయన తెలిపారు. సెప్టెంబరు 15లోగా రైతులంతా వారి వారి రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందితో పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏ శైలజారాణి, వీవీ శేషమ్మ, వీఏఏలు పాల్గొన్నారు.

ట్రైసైకిల్‌ను పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే కేపీ


ట్రై సైకిల్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డి

మార్కాపురం: దివ్యాంగురాలైన మహిళకు ట్రైసైకిల్‌ను మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి అందజేశారు. బుధవారం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగురాలికి ట్రైసైకిల్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ ఎం.మల్లికార్జునరావు, సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

పెద్దదోర్నాల: విలేజి హెల్త్ క్లీనిక్‌లో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నదోర్నాలలో ఆమె పర్యటించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో బీపీ, సుగర్ పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందించాలని కోరారు. వైద్యాధికారి లక్ష్మీనారాయణ, డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ యాగ్నిక్, వైద్య సిబ్బంది ఎస్తేరు రాణి, కేవీ రాణి, ఎ.భరత్‌భూషణ్, ప్రియాంక, కరుణమ్మ పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

- క్షతగాత్రుల్లో పెళ్లి కుమారుడు


గాయపడిన పెళ్లి కుమారుడు రవి


గాయపడిన ఆవులయ్య

దర్శి: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని అగ్నిపురికాలనీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తాళ్లూరు మండలం వెలుగువారిపాలేనికి చెందిన రావినూతల రవి తనకు రెండు రోజుల్లో జరిగే వివాహానికి బంధువులను ఆహ్వానించేందుకు దర్శి మండలం అగ్నిపురికాలనీకి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కాలనీ సమీపంలోని మూలమలుపులో మోటారు సైకిల్ అదుపు తప్పి అగ్నిపురికాలనీకి చెందిన గుంటూరు ఆవులయ్య మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడగా, రవి తలకు తీవ్రగాయమైంది. ఆవులయ్య చేతులకు, కాలికి గాయాలయ్యాయి. గ్రామస్తులు 108కు సమాచారం అందించగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రవిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు.

విద్యార్థులకు చేయూత


స్టడీ కిట్లతో విద్యార్థులు, హెచ్‌ఎం, సంస్థ ప్రతినిధులు

తర్లుపాడు: బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, విద్యా సామగ్రిని హెచ్‌ఎం ఎం.సుధాకర్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని ప్రతినెలా అందిస్తున్న బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ చైర్మన్ చాంద్‌పాషాను హెచ్‌ఎం అభినందించారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆయన తోడ్పాటును కొనియాడారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చేలా కృషి చేయాలని సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసులు సూచించారు. సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.